సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు తహశీల్దార్ బి.అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సిఐటియు నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని, మెనూ ఛార్జీలు ప్రతినెలా 5వ తేదీన చెల్లించాలని కోరారు. ధరల కనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, ప్రతి విద్యార్థికి మెనూ ఛార్జి రూ.20 రూపాయలు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాదాసు నాగేశ్వరరావు, షేక్ పాదుషా, కార్మికులు పాల్గొన్నారు.

108 సమ్మె సైరన్..!

సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల పోరుబాట

25 నుంచి సమ్మెకు సన్నద్ధం

కలెక్టర్, అధికారులందరికీ సమ్మె నోటీసులు అందజేత

రెండు జిల్లాల్లో సేవలందిస్తున్న 50 అంబులెన్స్‌లు

నెలకు దాదాపు 2,400 మంది రోగులకు సేవలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తమ సమస్యలను పరిష్కరించాలని 108 ఉద్యోగులు రోడ్డెక్కారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళ్లేందుకు ఉద్యోగులంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే కలెక్టర్ నుంచి సంబంధిత అధికారులందరికీ సమ్మె నోటీసులు అందించారు. 108 ఉద్యోగుల సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే. పగలూ రాత్రీ అనే తేడా లేకుండా ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు ముందుండేది 108 ఉద్యోగులే. రోడ్డు ప్రమాదాలు జరిగినా, అర్ధరాత్రి గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చినా ఆపద్బాంధవునిలా 108 వాహనం వచ్చి వాలిపోతుంది. రోగులను కాపాడేందుకు అందులో పని చేసే ఉద్యోగులు ఎంతగానో శ్రమిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులకు వాహనంలోనే ప్రసవం చేసిన ఘటనలు సైతం అనేకం ఉన్నాయి. ఆపద వస్తే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది 108 వాహనమే. ప్రజలకు ఇంత దగ్గరగా సేవలందిస్తున్న ఉద్యోగుల జీవన పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. ఏళ్లు గడుస్తున్నా 108 ఉద్యోగుల సమస్యలను మాత్రం ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తూనే ఉంది. ప్రయివేటు సంస్థలకు 108 అంబులెన్స్‌ల నిర్వహణా బాధ్యతను అప్పగించడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఉద్యోగులంతా భావించారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. 108 ఉద్యోగులు సమ్మెలోకి వెళ్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంది. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలనే అభిప్రాయం సర్వత్రా

వ్యక్తమవుతోంది. ఏలూరు జిల్లాలో 28, పశ్చిమగోదావరి జిల్లాలో 23 మొత్తం 51 వాహనాలు ప్రజలకు సేవలందిస్తున్నాయి. గడిచిన ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ ఏలూరు జిల్లాలో 16,568 మంది రోగులను 108 అంబులెన్స్‌ల్లో తరలించారు. ప్రతినెలా సరాసరిన 2,360 మందిని 108 వాహనాల్లో తరలించి వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితి. ప్రభుత్వం 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.

108 ఉద్యోగుల డిమాండ్లు ఇవే

ఉద్యోగులు పలు సమస్యలకు సంబంధించిన డిమాండ్లను ఇప్పటికే ప్రభుత్వం ముందుంచారు. అవన్నీ న్యాయమైన డిమాండ్లే. ఉద్యోగులు పేర్కొన్న డిమాండ్లు ఇవే. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రస్తుతం ఉన్న రెండు షిఫ్టుల విధానాన్ని మూడు షిఫ్టుల విధానంలోకి మార్చి ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలి. 108 సర్వీసుల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ మార్కులు ఇవ్వాలి. వైద్యఆరోగ్యశాఖలోని ఇఎంటి పోస్టుల నియామకాల్లో 108లో పని చేస్తున్న ఇఎంటిలను నియమించాలి. గతంలో టిడిపి ప్రభుత్వంలో అమలు చేసిన జిఒ.49 ప్రకారం ఉద్యోగులకు నెలకు రూ.నాలుగు వేలు చెల్లించేవారు. వైసిపి ప్రభుత్వం దాన్ని నిలుపుదల చేసింది. జిఒ 49ను పునరుద్ధరించాలి. సహజ, ప్రమాద మరణం పొందిన ఉద్యోగి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలి. ప్రతి మండల కేంద్రంలోనూ 108 వాహనాలకు, అందులో పని చేస్తున్న ఉద్యోగులకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుత నిర్వహణా సంస్థ నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలి. ఎఐఎంఎస్ సంస్థ ఇచ్చిన హామీ మేరకు వేతన శ్లాబ్‌లను అప్‌డేట్ చేయాలి. మరమ్మత్తుకు గురైన వాహనాలను వెంటనే బాగుచేయించాలి. ప్రతి ఉద్యోగికీ 40 శాతం ఇంక్రిమెంట్‌ను జులై నుంచి లెక్కగట్టి వచ్చే నెల వేతనంతో జమ చేయాలి. వేతనాలు ప్రతినెలా ఐదో తేదీలోపు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒప్పందాలపై జిఒలు ఇవ్వండి

కలెక్టరేట్ వద్ద ఆశాల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ఆశా కార్యకర్తలపై పనుల భారం తగ్గించి ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆశాలు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆశాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి దిగుపాటి జ్యోతి మాట్లాడారు. గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పంద హామీలు నూతన ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనేక యాప్ ద్వారా పని చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, నూతన సెల్‌ఫోన్లు ఇంతవరకూ అందించలేదని విమర్శించారు. కార్యకర్తలకు అనారోగ్యమైన సెలవులు ఇవ్వట్లేదని ఆశాలకు కార్మికశాఖ అమలు చేయాలన్నారు. ఆశాలకు 62 సంవత్సరాలు వరకూ కొనసాగించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రూ.ఆరు లక్షలు జీవిత బీమా చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశాలపై రాజకీయ వేధింపులు పెరిగాయని, రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరారు. ఆశాల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సిఐటియు జిల్లా నేతలు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్, డిఎంహెచ్ఒ, అధికారుల బృందానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్.కుమారి, వరలక్ష్మి, రాజేశ్వరి, రమాదేవి పుష్ప పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆశాలు

రక్త కేంద్రాన్ని వినియోగించుకోవాలి

కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలో అందుబాటులోకి వచ్చిన రక్త కేంద్రాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం భీమవరం రాయలంలో నూతన రక్త కేంద్రాన్ని నాగరాణి, రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ ఛైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి రక్త నిధి కేంద్రంలోని వివిధ విభాగాలను సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాయలంలో రక్త కేంద్రానికి ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్‌క్రాస్ ద్వారా సమకూర్చిన నిధులు రూ.2.50 కోట్లతో అవసరమైన యంత్రాలు, పరికరాలు తదితరాలను ఏర్పాటు చేశామన్నారు. రక్త కేంద్రం ద్వారా రక్తం, దాని భాగాలను ఎర్ర రక్త కణాలు, ప్లేట్‌లెట్లు, ప్లాస్మాతో సహా పొందవచ్చన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో జిల్లాలో మొత్తం మూడు రక్త కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను రక్షించడంలో ప్రజలు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు.

రక్త కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

26న ఎస్‌కెఎం ధర్నా

అఖిలపక్ష సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఈ నెల 26న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిలపక్ష సమావేశం నిర్ణయించింది. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను, కార్మికులను మోసగించిందని విమర్శించారు. ఢిల్లీలో 13 నెలలపాటు ఉద్యమించిన సందర్భంగా ప్రధానమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేయబోమని ఎన్నికల ముందు చెప్పిన కూటమి అధికారం చేపట్టాక భారాల మోత మోగిస్తోందని విమర్శించారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కె.తవిటినాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, చెల్లబోయిన రంగారావు, కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, వైవి.ఆనంద్, మామిడిశెట్టి లక్ష్మీపతి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నేతలు

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసి షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా రూపొందించి, ప్రకటిస్తామని తెలిపారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఈ నెల 20న డ్రాఫ్ట్ రోల్ ప్రచురణ, 23న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రకటన, 23 నుండి డిసెంబర్ 9 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 25న క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని వివరించారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. ఉమ్మడి శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి జిల్లాలో 67,793 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారని, గత ఎన్నికల్లో 65 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం అదనంగా 27 పోలింగ్ స్టేషన్లు అవసరమని తెలిపారు. అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అభ్యంతరాలు లేకపోతే జాబితాను ఇసికి పంపుతామన్నారు. సమావేశంలో డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు, మరపట్ల శ్యాంబాబు (టిడిపి), గోవర్ధన్ (బిజెపి), ఎం.రత్నరాజు (బిఎస్‌పి), వంశీరెడ్డి (కాంగ్రెస్), కె.రాజ్‌కుమార్, ఆర్.జార్జిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

అనారోగ్యంతోనే గోవిందరావు మృతి

కరెంటు సమస్య కాదు: టిడిపి - ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని అయి భీమవరంలో కాలువ గట్టు నివాసితుడు గోవిందరావు (55) మృతికి అనారోగ్యమే కారణమని, ఇంటికి విద్యుత్ కట్ చేయడం వల్ల కాదని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నౌకొట్ల రామారావు, గ్రామాధ్యక్షుడు జంపన రాజన్‌రాజు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి మీసాల రవికుమార్ స్పష్టం చేశారు. 'కరెంట్ ఆపారు.. ఊపిరి ఆగింది' శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తను వారు ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. గోవిందరావు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడని, గతంలోనే ఆయనకు స్టంట్ వేశారని తెలిపారు. కాల్వగట్టుపై ఆయన ఇల్లు తొలగించినా అదే గ్రామంలో 78వ నెంబర్‌తో సెంటున్నర భూమి కేటాయించారని తెలిపారు. గోవిందరావు మృతికి అనారోగ్యమే కారణమని పేర్కొన్నారు.

నరసాపురం డిఎస్‌పిగా శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిఎస్‌పిగా డాక్టర్ జి.శ్రీవేద సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె 2022 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. అనంతపురం డిటిసి, గ్రేహౌండ్స్ ట్రైనింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. వేదకు తొలి పోస్టింగ్ నరసాపురం కావడం విశేషం. ఆమె తండ్రి సూర్యప్రకాశరావు ఏలూరు రేంజ్ డిఐజిగా పని చేసి 2017లో ఐజి హోదాలో రిటైరయ్యారు. వేద స్వస్థలం శ్రీకాకుళం జిల్లా. నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లిలో డాక్టర్ విద్య పూర్తి చేసి శ్రీకాకుళం జిల్లా పాడంగిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డెంటల్ అసిస్టెంట్ సర్జన్‌గా కొద్దికాలం పని చేశారు. పోలీస్ శాఖలో పని చేయాలనే లక్ష్యంతో ఉద్యోగం చేస్తూనే గ్రూపు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. మొదటి ప్రయత్నంలోనే ర్యాంకు సాధించి పోలీస్ శాఖలో చేరారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వేద మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఫ్రెండ్లీ పోలీస్ విధానంతోపాటు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికీ న్యాయం జరిగేలా చూస్తానన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేతన బకాయిలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

నాలుగు నెలలుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న శానిటరీ వర్కర్స్ (ఆయా)కు నేటికీ వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బి.అనితకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత జులై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు ఆయాలకు తక్షణం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పనిచేసే ఆయాలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, ఆయాలు టి.దుర్గ, కె.ఏసుమణి, వై.సునీత, గెడ్డం రమణ, జుత్తిగ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

ఫిర్యాదులు పూర్తిస్థాయిలో పరిష్కరించాలి : కలెక్టర్

భీమవరం: 'మీకోసం'లో వచ్చిన ఫిర్యాదులకు సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో సోమవారం జిల్లాస్థాయి మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావుతో కలిసి ప్రజల నుండి 169 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో నిర్ణీత గడువు దాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తుదారులకు జిల్లా అధికారులు జవాబుదారీతనంతో కూడిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు జారీ చేశారు. పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులు సంబంధిత అధికారులు సరైన సమాధానంతో పరిష్కరించని కారణంగా రీఓపెన్ అవుతున్నాయన్నారు.

ఆసుపత్రిలో ఎంఎల్ఎ నాయకర్ తనిఖీ

నరసాపురం: నరసాపురం ఏరియా ఆస్పత్రిని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందించే వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమీక్షించారు. వైద్య సేవల నాణ్యతను మెరుగుపర్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్, ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ, వైద్యులు జెట్టి గణేష్‌బాబు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన టిడిపి నేతలు

పాలకోడేరు : పాలకోడేరు మండలానికి చెందిన టిడిపి ముఖ్యనేతలు కామన రాంబాబు, కమ్మిల రాంబాబు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యాలయ సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కామన రాంబాబు, కమ్మిల రాంబాబు మాట్లాడుతూ ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు డిప్యూటీ స్పీకర్‌గా నియమితులు కావడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న రఘురాం కృష్ణంరాజు సభాపతిగా రాష్ట్రానికి సేవలందించడం గర్వించదగ్గ విషయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు రఘురాం కృష్ణంరాజు అవరోధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు.

రఘురామకృష్ణంరాజును కలిసిన నేతలు

రైతుసేవా కేంద్రం నిర్ధారణే ఖరారు చేయాలి

కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోళ్లలో రైతుసేవా కేంద్రం నిర్ధారించిన తేమ, నూక శాతాన్ని మిల్లర్లు పరిగణనలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు కోరారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ప్రారంభమైన సార్వా ధాన్యం కొనుగోలు సమయంలో రైతుసేవా కేంద్రాల్లో నిర్ధారించిన తేమ, నూకశాతాన్ని పరిగణనలోకి తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతుసేవా కేంద్రాల్లో నిర్ధారించిన తేమ, నూకశాతాన్ని రైస్‌మిల్లర్లు పరిగణనలోకి తీసుకోకుండా అదనంగా పాయింట్లు చూపించి రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తూచే సమయంలో ప్రతి సార బస్తాకు అదనంగా ఒక కేజీ తీసుకుంటున్నారని, అయినా మిల్లులకు వెళ్లాక తరుగు పేరుతోనూ, తేమ పేరుతోనూ వేలాది రూపాయలు కట్టించుకుంటున్నారని ఆరోపించారు. తక్షణం ఈ దోపిడీని అరికట్టి, గోనెసంచులు, రవాణా వాహనాలు రైతుసేవా కేంద్రాల ద్వారా ఇవ్వాలని, ధాన్యం డబ్బు, హమాలీ, రవాణా ఛార్జీలు వెంటనే అందేలా చూడాలని, మిల్లుల వద్ద సమస్యలు ఎదురైతే వెంటనే కస్టోడియన్ అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. దీనిపై జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సమయంలో రైస్‌మిల్లర్ల నుండి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌలురైతులు బండి శ్రీనివాసు, కేతా మోహన్ పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌కు వినపత్రం అందజేస్తున్న నేతలు

హమాలీలకు నూతన అగ్రిమెంట్ చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తణుకు

సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులకు వెంటనే నూతన అగ్రిమెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా సోమవారం నిర్వహించారు. నూతన వేతన ఒప్పందం చేయాలని, ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, ఇఎస్ఐ వెంటనే అమలు చేయాలని, గోడౌన్ వద్ద స్వీపర్‌ను నియమించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ కార్మికులకు 2014 జనవరిలో జరగాల్సిన నూతన రేట్లు పెంపుదల నేటికీ చేయకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలన్నారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం వల్లే ఘోరంగా ఓటమి చెందిందన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు గార రంగారావు, జట్టు మేస్త్రి ఎన్.చిన్నారావు, కుడిపూడి రాము, శివ, రాజు, ఎ.గోవింద్, పి.అప్పన్న, వి.నాగేశ్వరరావు, ఎ.నర్సింహమూర్తి, సాయి, రమణ, అనిల్ పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

పద్మకుమారి స్నేహశీలి, సమాజ సేవకురాలు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి - ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఏలూరు

రావి పద్మకుమారి స్నేహశీలి, సమాజ సేవకురాలు అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కొనియాడారు. సోమవారం ఉదయం డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య సతీమణి రావి పద్మకుమారి అంత్యక్రియలు నిర్వహించారు. వీటిలో రమాదేవి, ఐద్వా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య భార్య పద్మకుమారి అనారోగ్యం వల్ల అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరమన్నారు. సిపిఎం, కమ్యూనిస్టు అభిమాని అయిన గోపాలకృష్ణయ్య ప్రముఖ వైద్యులు, సేవాతత్పరులుగా పేరొందారని గుర్తు చేశారు. తన వృత్తి జీవితంలో అనేకమంది ప్రజలకు వైద్య సహాయాన్ని అందించారని తెలిపారు. భర్త గోపాలకృష్ణయ్యతో కలిసి అనేక సేవా కార్యక్రమాల్లో పద్మకుమారి పాలుపంచుకునే వారన్నారు. పేద విద్యార్థులు, మహిళల కోసం సాధన ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారని కొనియాడారు. ఈ సమయంలో అకస్మాత్తుగా పద్మకుమారి మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి, నాయకులు జి.శారద, పి.ఉషారాణి, కె.కల్పన, సిహెచ్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పద్మ కుమారి మృతి పట్ల ఐద్వా సీనియర్ జిల్లా నాయకురాలు గారపాటి విమల, గుత్తికొండ విజయ తదితరులు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పద్మకుమారి భౌతికకాయం వద్ద నివాళు లర్పిస్తున్న నేతలు

అదనపు పని ఒత్తిడిని మినహాయించాలి

ఎఎన్ఎంల ఆందోళన

ప్రజాశక్తి - యలమంచిలి

తమకు ప్రభుత్వం అప్పగిస్తున్న అదనపు పనుల నుంచి మినహాయించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎఎన్ఎంలు ఆందోళన నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రేమాన్వితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రోజు వారీ పనిలో భాగంగా ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తూ గర్భిణులు, బాలింతలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, ఎంతో బాధ్యతగా పనిచేస్తున్న తమపై ప్రభుత్వం అదనపు పనుల భారాన్ని మోపడం వల్ల ఎంతో ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమపై అదనపు భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్, ఎఎన్ఎంలు ఎం.వెంకటలక్ష్మి, వి.నాగలక్ష్మి, ఆర్.ప్రేమకుమారి పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి : ఆర్‌డిఒ

నరసాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసి రాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 15 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అధికారులు పాల్గొన్నారు.

డ్రై డే పాటించాలి

తాడేపల్లిగూడెం: దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైబి.లక్ష్మణరావు తెలిపారు. సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 32, 31వ వార్డులో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలపై జరిగిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ప్రతి శు క్రవారమూ డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి రమణ, వెంకటలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పార్వతి, శ్రీలక్ష్మి, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

రామ్మూర్తికి టిడిపి నివాళి

భీమవరం టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతికి సంతాపంగా సోమవారం భీమవరం పట్టణ టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు టిడిపి పటిష్టతకు అనేక రకాలుగా కృషిచేశారని తెలిపారు. వారి మృతి టిడిపికి తీరని లోటని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యునిగా రామ్మూర్తి నాయుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి తెలుగుదేశ పార్టీకి వెన్నుముకగా ఉండేవారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మేరగాని నారాయణమ్మ, మైలాబత్తుల ఐజాక్ బాబు, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా రామ్మోహన్‌రావు

నరసాపురం: మండలంలోని పసలదీవి గ్రామంలో ఈ నెల 16వ తేదీన సిపిఎం మండల మహాసభ జరిగింది. ఈ మేరకు సిపిఎం మండల కార్యదర్శిగా జల్లి రామ్మోహన్‌రావు ఎన్నికైనట్లు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. పార్టీ మండల మహాసభ కొత్త మండల కమిటీని ఎన్నుకుందని, 11 మందితో మండల కమిటీ సమావేశమై కార్యదర్శిగా జల్లి రామ్మోహన్‌రావును తిరిగి ఎన్నుకున్నారని పెద్దిరాజు ప్రకటించారు. రాబోయే కాలంలో ఈ మండల కమిటీ పని చేస్తుందన్నారు. మండలంలో పంట కాలవలు దర్భరేవు డ్రెయిన్‌లో పూడిక తీసి ఆధునికీకరణ పనులు చేయాలని, వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులు అర్హులందరికీ చెప్పాలని తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ఎల్‌బిచర్ల గవర్నమెంట్ ఆసుపత్రిని పున:ప్రారంభించాలన్నారు. కొప్పరు పిహెచ్‌సిని నిర్మించాలని మహాసభలో తీర్మానాలు ఆమోదించినట్లు పెద్దిరాజు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ఉండి: దేశవ్యాప్తంగా సహకార సంఘాల బలోపేతానికి కృషి జరుగుతోందని జిల్లా సహకార అధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. 71వ జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా సోమవారం యండగండి సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జి పి.రామదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డి.వెంకటేశ్వరరావు, సబ్ డివిజనల్ అధికారి జి.సత్యనారాయణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1904లో ప్రారంభమైన సహకార వ్యవస్థ రోజురోజుకూ బలోపేతం అవుతోందని, పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల పాత్ర ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సహకార రంగంలో మూడో అంచెలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సేవలను విస్తృతం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి చెరుకువాడ రవికుమార్, సిబ్బంది, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కూరగాయలు ఆరోగ్యానికి మేలు

మొగల్తూరు: రసాయనాలు వేయకుండా జీవామృతం, కషాయాల ద్వారా పండించిన కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని తహశీల్దార్ కె.రాజకిశోర్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్టాల్ ఏర్పాటు చేశారు. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారితోటలో పండించిన వంకాయ, బీరకాయ, దొండకాయ, బెండకాయ, ఆనపకాయ, తోటకూర తదితర కూరగాయలు, ఆకుకూరలను విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.లక్ష్మికుమారి, ఆర్.పుష్ప, కనకదుర్గాభవాని, ఎం.దుర్గాభవానీ, పి.రామలక్ష్మి పాల్గొన్నారు.

ఛాంబర్స్‌లో ఫిజిక్స్‌పై అవగాహన

పాలకొల్లు: ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఫిజిక్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ప్రిన్సిపల్ ఎపివి అప్పారావు విచ్చేశారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు ఫిజిక్స్ ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో భౌతికశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్. నరసింహారావు, కళాశాల అకడమిక్ అడ్వయిజర్ ఎబిఎన్ మూర్తి పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

నరసాపురం: పోడూరు హెడ్ కానిస్టేబుల్ మానేపల్లి సింగ్‌పై నరసాపురం పోలీస్ స్టేషన్ లో ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలో నివాసముంటున్న హెడ్ కానిస్టేబుల్ మానేపల్లి సింగ్ ఒంటరిగా ఉన్న బాలిక ఇంట్లోకి వెళ్లి చేయిపట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ బాలిక కానిస్టేబుల్ నుంచి తప్పించుకుని బంధువులకు చెప్పింది. బంధువులు కానిస్టేబుల్ సింగ్‌ను ప్రశ్నించగా అతను దౌర్జన్యంగా బూతులు తిడుతూ బెదిరించడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్క్మి సిహెచ్. జయలక్ష్మి కేసు నమోదు చేశారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

నరసాపురం: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన ఇద్దరి యువకులపై రూరల్ పోలీసులు సోమవారం పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్క్మి టి..వెంకట సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనిపించడం లేదంటూ ఈనెల 12న బంధువులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో విచారణ చేపట్టగా పట్టణానికి చెందిన నరసింహస్వామి బాలికకు మాయమాటలు చెప్పి తీసికెళ్లినట్లు గుర్తించామన్నారు. నర్సింహస్వామికి పట్టణానికి చెందిన చింతా నాగరాజు సహకరించినట్లు తేలడంతో ఇద్దరిపై పోక్సో కేసుతోపాటు, ఎస్‌సి, ఎస్‌టి, కిడ్నాప్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814



విద్యుత్ వైర్లకు అల్లుకున్న పాదులు

అల్లుకున్న నిర్లక్ష్యం..!

విద్యుత్ స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని స్టీమర్ రోడ్డు దుర్గమ్మ ఆర్చ్‌కు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభానికి, వైర్ల చుట్టూ పిచ్చి మొక్కలు, పాదులు పెరిగిపోయాయి. నిత్యం రద్దీగా ఉన్న సెంటర్లో విద్యుత్ వైర్లకు పాదులు అల్లుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ వైర్లకు ఇలా తీగలు ఉండడంతో సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలపై పాదులు తొలగించాలని కోరుతున్నారు.

వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

డాక్టర్ పి.లక్ష్మీసునంద

ప్రజాశక్తి - ఉండి

వైరల్ జ్వరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ పి.లక్ష్మీ సునంద అన్నారు. సోమవారం లక్ష్మీసునంద మాట్లాడుతూ కరోనా వచ్చిన నాటి నుంచి ప్రతి ఒక్కరిలో రోగ నిరోధక శక్తి క్షీణించిందన్నారు. దీనివల్ల ప్రతి ఒక్కరూ వైరల్ జ్వరాల బారిన పడుతున్నారన్నారు. గతంలో డెంగీ జ్వరం వచ్చినప్పుడు ప్లేట్లెట్లు క్షీణించేవని, నేడు వైరల్ జ్వరాల బారిన పడడం వల్ల ప్లేట్లెట్లు క్రమేపీ క్షీణిస్తున్నాయని తెలిపారు. తద్వారా రోగి కీళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎవరైనా వైరల్ జ్వరాల బారిన పడితే వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవడమే మార్గమన్నారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఉన్నచోట తప్పకుండా మాస్క్ వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ప్రస్తుతం పంట కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆక్వా వ్యర్థాలు విడుదల చేయడం వల్ల నీరు కలుషితమవుతోందన్నారు. ఎవరైనా ఒకటి అంతకంటే ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడితే వెంటనే దగ్గరలోని డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని ఆమె కోరారు.

సిపిఎం సానుభూతిపరుడు సత్యం మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

సత్యం (ఫైల్ ఫొటో)

సిపిఎం సానుభూతిపరుడు చించినాడ గ్రామానికి చెందిన విప్పర్తి సత్యం (67) సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సత్యం మృతి వార్త తెలియగానే సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా సత్యం సిపిఎం పార్టీలో సానుభూతిపరుడుగా కొనసాగుతున్నారని, పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా ఆయన చురుకైన కార్యకర్తగా పాల్గొనేవారిని గుర్తు చేశారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు తెన్నేటి స్టాలిన్, మురాల రాజేష్, మురాల జైసింగ్, గుర్రాల రత్నప్రసాద్, విప్పర్తి నాని, అవినాష్, ముమ్మిడివరపు ఆంజనేయులు, తెన్నేటి శివాజీ, ముస్కోడి విజయకుమార్, బోసి రాజశేఖర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న అఖిల్ శ్రీవర్మ రాష్ట్రస్థాయి డబుల్ బేచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ పిడిఎం పద్మావతి సోమవారం చెప్పారు. అఖిల్ శ్రీవర్మ సరిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి అని చెప్పారు. ఇప్పటికి మూడుసార్లు అఖిల్ శ్రీవర్మ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అఖిల్‌కు శిక్షణ ఇచ్చిన పద్మావతిని, ప్రధానోపాధ్యాయులు ఎంవిఎస్ఎన్.మూర్తి ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఉండాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బోల్లెంపల్లి రమేష్ ఎంఎల్ఎ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని సోమవారం నరసాపురం రాయపేట బాలుర వసతి గృహంలో బాలురకు దుప్పట్లు, పండ్లు నాయకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులు మధ్య బర్త్ డే కేకు ను కట్ చేయించి అందరికీ పంపిణీ చేశారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నాయకర్ అన్నారు. కార్యక్రమంలో గనేశ్న శ్రీరామ్, కృష్ణ భగవాన్, తోట వెంకటేష్ పాల్గొన్నారు..

వైఎన్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల చరిత్ర, రాజకీయ శాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'మౌర్య రాజవంశం మేధో ఆలోచనలు, విలువలు అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా రాష్ట్ర హిస్టరీ కాంగ్రెస్ జీవిత కాల సభ్యులు అడపా సత్యనారాయణ మౌర్య వంశ స్థాపన, రాజులు పలు అంశాలపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, చరిత్ర వి బ. ా గా ా ది. ్ తి ఎస్.సోమశేఖర్, రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె ఎ న్ వి . ర ం గా రా వు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, NIMMANA DEVID RAJU S/o. Nimmana Mahankali Rao, resident of, D.No. 3-105, Pittavari Meraka, Lakshmaneswaram, Narasapuram Mandal, W.G.Dt., A.P. I have changed my name from NIMMANA YESURAJU (Old name) to NIMMANA DEVID RAJU (New name) hence after all my documents and correspondence will be countinue with my New name NIMMANA DEVID RAJU

ప్రముఖులు అజ్మల్‌సాబ్ మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

అజ్మల్‌సాబ్ (ఫైల్‌ఫొటో)

స్థానిక ముస్లిం ప్రముఖులు, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎమ్‌డి అజ్మల్‌సాబ్ (78) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మనవడు మత్తుమందు వైద్య నిపుణులు ఎమ్‌డి బిలాల్ పట్టణంలో ప్రస్తుతం ప్రముఖ వైద్యులుగా కొనసాగుతున్నారు. ఆయన మృతి పట్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, మాజీ జెడ్‌పి డిప్యూటీ ఛైర్మన్ మన్నే లలితాదేవి పోతరాజు, టిడిపి మండల అధ్యక్షులు మోటుపల్లి ప్రసాద్ తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

కూలి రేట్లు పెంచాలని నిరసన

ప్రజాశక్తి - పెనుమంట్ర

సివిల్ సప్లయిస్‌లో పనిచేసే హమాలీ కార్మికులకు ఎగుమతి, దిగుమతి కూలి రేట్లు పెంచాలని కోరుతూ కార్మికులు నిరసన తెలిపారు. సోమవారం స్థానిక సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో పెనుమంట్ర సివిల్ సప్లయ్ గోదాము వద్ద నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ తక్షణం కార్మికులకు ఎగుమతి, దిగుమతి కూలి రేట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు, జి.ఆంజనేయులు, కె.శ్రీరామ్ చంద్ర పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

PONNAMANDA DURGA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యా లయం అధికారులు ది.25-09-2017న R4553180 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్ పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు ది.10-11-2024న దారి తప్పి గ్రామం నుండి నరసాపురం వస్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

PONNAMANDA DURGA
W/o. Ponnamanda Yesu
D.No. D.No. 4-91, Daritippa
Mogalturu Mandal, W.G.Dt., A.P.

రక్షణ, పరిశోధన రంగాల్లో స్వావలంబన

డిఆర్‌డిఒ శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రక్షణ, పరిశోధనా రంగాల్లో భారత్ స్వావలంబన సాధించే దిశగా అడుగులు వేస్తోందని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) శాస్త్రవేత్త, డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లేబరేటరీ(డిఎంఆర్‌ఎల్) పూర్వపు డైరెక్టర్ డాక్టర్ జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ఆచార్యులు డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రఫీ మహమ్మద్ సహకారంతో సోమవారం డిఆర్‌డిఒలో పరిశోధనలకు నిధులు సమీకరణ, అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిట్ డీన్ ఫ్యాకల్టీ అఫైర్స్, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ వ్యవస్థలో డిఆర్‌డిఒ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. దేశ రక్షణ పరిశోధనలకు సంబంధించి ఎన్‌ఐటిల భాగస్వామ్యం ఉండాలన్నారు. విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలు చేస్తూ ప్రపంచం గర్వించే నూతన ఆవిష్కరణలు రూపకల్పనకు కృషి చేయాలన్నారు. అనంతరం మధుసూదన్ రెడ్డిని ఆచార్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ జిబి వీరేసుకుమార్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ పోయినది

విషయం : నా కుమారుడు SSC సర్టిఫికెట్ నందు నా ఇంటి పేరులో గల అక్షర దోషమును సరిచేసుకుంటున్న విషయమును పత్రికాముఖంగా తెలియపరచుట గురించి.
మా కుమారుడు అయిన తన్నీడి అనీల్ కుమార్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భీమవరంలో SSC చదవడం జరిగింది. మా కుమారుడి యొక్క SSC సర్టిఫికెట్‌లో నా యొక్క పేరు TANNIDI KANAKARAJU గా ముద్రించబడినది. కానీ నా యొక్క అసలు పేరు TANNEDI KANAKARAJU నా ఇంటి పేరులో గల దోషమును సరిచేసుకుంటున్నాను. ఈ విషయాన్ని పత్రికాముఖంగా ప్రజలందరికీ తెలియజేసుకుంటున్నాను.
ఇట్లు
తన్నీడి కనకరాజు
కోమటి తిప్ప పంచాయితీ
నీటితిప్ప గ్రామం, మొగల్తూరు మండలం, ప.గో.జిల్లా

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం చదరంగం, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు ఘనంగా నిర్వహించారు. చదరంగం పోటీలను నరసాపురం చెస్ అకాడమీ గణేష్ కుమార్ ప్రారంభించారు. గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కేజిఎస్ ఎల్ కుమారి పర్యవేక్షించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మూరి రమా, సుధీర్ మోహన్ పాల్గొన్నారు.

గణపవరం : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పిప్పర గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, టిబెట్, చెస్, క్యారమ్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు పి.రంగారావు మాట్లాడుతూ ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 20న తేదీనయ బహుమతులు అందజేస్తామని చెప్పారు.

ఉండి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఉండి, యండగండి శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు క్విజ్, పలు రకాల ఆటల పోటీలు నిర్వహించినట్లు ఉండి, యండగండి గ్రంథాలయాల అధికారులు జెవి కృష్ణమూర్తి, ఎన్‌సిహెచ్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో యండగండి గ్రంథాలయం అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షులు చెరుకువాడ రవికుమార్, అధ్యక్షులు సత్యరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. వృక్షాలు వాటి ఉపయోగాలు, పౌర గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గరికపాటి బాపయ్యశర్మ, పత్తి వీరాస్వామి, వి.జాన్‌బాబు, ఐ.జయప్రద పాల్గొన్నారు.

తణుకు: ప్రజల కష్టాలను చూసి చలించిన రామరాజు బ్రిటీష్ వాడికి వ్యతిరేకంగా తన పోరాటంతో మన్యంలో నిప్పు కణాన్ని రాజేశారని జర్నలిస్ట్ బెల్లంకొండ బుజ్జిబాబు అన్నారు. సోమవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవం రోజు, అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సందర్భంగా జాతీయ ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాట జీవితం–నేటితరం పొందాల్సిన స్ఫూర్తి అంశంపై జి.ఉషారాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం కళాశాల విద్యార్థులకు క్విజ్, హైస్కూల్ విద్యార్థులకు పేపర్‌క్రాఫ్ట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సుగుణకుమారి పాల్గొన్నారు.

EC పాస్ పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఆచంట గ్రామం కాపరస్తుడైన యాండ్ర శివప్రసాద్, తండ్రి ధర్మారావు అను నేను నా యొక్క EC పాస్పోర్ట్ పోయినది. ఇంటి దగ్గర నుండి ఆచంట కచేరి సెంటర్ దగ్గరికి వస్తుండగా నా యొక్క EC పాస్పోర్ట్ పోయినది. EC PASSPORT NO : X0962376 గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు

యాండ్ర శివప్రసాద్, తండ్రి : ధర్మారావు
డోర్.నెం: 28-12, క్రిందిపోరా,
ఆచంట గ్రామం, ఆచంట మండలం,
ప.గో.జిల్లా. సెల్ : 8985143236

గ్రామీణ పేదలకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలి : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం కొత్తపూసలమర్రు పేదలు గూట్లపాడు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి సిహెచ్ రమాలీలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేదలకు 3 సెంట్ల చొప్పున స్థలాలు మంజూరు చేసి గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రూరల్ మండల కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిరుమాని కామేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు : ఇళ్ల పట్టాలకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని సిపిఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. సిపిఐ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో 2వ వార్డు సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సెక్రటరీ దేవరకొండ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిసిఐ పట్టణ సమితి నాయకులు పులవర్తి సత్యనారాయణ, బొద్దాని మురళీకృష్ణ, సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఉండి: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీను, మండల కార్యదర్శి తమ్మరాని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉండి, మహాదేవపట్నం, అర్తమూరు గ్రామాల్లో ఆయా సచివాలయ కార్యాలయం వద్ద సోమవారం మహాధర్నా నిర్వహించి ఆయా సచివాలయ సిబ్బందికి దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కలిశెట్టి వెంకట్రావు, సనపల శ్రీను, కోన గొల్లయ్య, తమరాని శ్రీనివాస్ మాట్లాడారు. పాలకులు పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు.కార్యక్రమంలో ఎఐటియుసి మండల కార్యదర్శి పతివాడ గణపతి, శాఖ కార్యదర్శి వీరన్నపల్లి పెద్దులు, గంట బుజ్జమ్మ, వీరన్నపల్లి మణి, మర్రి మేరీ పాల్గొన్నారు.

నోటీసు
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో : నర్సాపురం
I.P.No.18/2023

Between:
యిళ్ళ సూర్యవతి ...పిటీషనర్
Vs
వట్టికూటి విఘ్నేశ్వరి వగైరా ...రెస్పాండెంట్
To.
R1: వట్టికూటి విఘ్నేశ్వరి, భర్త హనుమంతరావు, డోర్‌నెం.2-89, పండిత విల్లూరు, పోడూరు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. PJCJC.

పై నెంబర్ పిటీషనులో మొదటి రెస్పాండెంట్ అయిన మీకు శ్రీకోర్టు వారు అనేక పర్యాయములు నోటీసు పంపించినప్పటికి తీసుకొనకుండా తప్పించుకుని తిరుగుచున్నందున మీ హాజరు నిమిత్తము వాయిదా ది.29-11-2024 తేదిన యున్నది. ఆరోజు ఉదయం 10-30 ని॥లకు మీరు స్వయముగా గాని వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు అభ్యంతరములు ఉన్నయెడల తెలియజేసుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రిక ప్రకటన ద్వార తెలియపరచడమైనది. శ్రీకోర్టు వారి ఆదేశములు మేరకు.
వాయిదా తేది: 29-11-2024

పాలకొల్లు — ఐ.శివసాంబమూర్తి
తేది.17-11-2024 — అడ్వకేట్, పాలకొల్లు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 403/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
-వాది
మరియు
D-1) వెలగన వెంకటలక్ష్మి అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: వెలగన వెంకటలక్ష్మి, W/o. లక్ష్మణకుమార్, డోర్ నెం. 7-19, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల వర్ధనరావు, S/o. చిరంజీవి, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలపిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం — నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 — సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 299/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
-వాది
మరియు
D-1) బోనం విజయలక్ష్మి అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: బోనం విజయలక్ష్మి, W/o. శేషారావు, డోర్ నెం. 2-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: కట్టా మురళి, S/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-139, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలపిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం — నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 — సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 171/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
-వాది
మరియు
D-1) తొంటా జ్యోతి అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: తొంటా జ్యోతి, W/o. శ్రీనివాసరావు, డోర్ నెం. 2-72, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల స్వాతి, D/o. రాజేశ్వరరావు, డోర్ నెం. 4-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలపిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం — నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 — సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 297/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
-వాది
మరియు
D-1) కొండేటి శ్రీరామచంద్రమూర్తి అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:
D-1: కొండేటి శ్రీరామచంద్రమూర్తి, S/o. వెంకటరమణారావు, డోర్ నెం. 2-103, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, డోర్ నెం. 4-129, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలపిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 21-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం — నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 18-11-2024 — సెల్: 98662 59514